మామయ్య

అనుకున్న పని వొక్కటీ కాలేదు. అందు వల్ల నిరాశతో కుంగిపోవటం అలవాటు లేని మనిషిని కనక సరిపోయింది. కాని యీ ఊరు కాని ఊళ్ళో యీ చలికాలపు రాత్రి గడపటం ఎలా? యెవరైనా యెరిగిన స్నేహితుడన్నా కనిపిస్తే బాగుండు! యేదో విధంగా యీ రాత్రికి కాలక్షేపం జరుగుతుంది. ఇంతపెద్ద పట్టణంలో యెవరో ఒక స్నేహితుడు నాకు ఉండి ఉండొచ్చు; కాని ఎక్కడ ఉంటున్నాడో తెలియదు. కనీసం యేదారిలోనన్నా ఎదురైతే తప్ప, ఆ స్నేహితుణ్ణి గుర్తించే అవకాశం దొరకదు. పోనీ యిప్పటికి ఇంటికి వెళ్ళి మరి కొన్నాళ్ళకు వొద్దామనే పనిగాదు. నాలుగైదు రోజులైనా సరే ఉండి ఏదో విధంగా వ్యవహారం పరిష్కారం చేసుకోవలసిన అవసరం ఎంతైనా వుంది.

సామాను హోటల్లో పడేశాను. కాలక్షేపం జరిగే మార్గమేమీ కనిపించ లేదు. పోనీ కళ్లు మూసుకొని పడి వుంటే నిద్ర వొచ్చి, కొంత కాలం నాకు తెలియకుండానే జారిపోతుందేమో ననే ఆశ పోలేదు- కాని నిద్ర అనేది రావటమూ, పోవటమూ మానవుడి అధీనంలోది మాత్రం కాదు. అదీకాక ఒక వేళ ఇప్పుడు నిద్రపోతే - నిద్రలేచాక గడపవలసిన కాలం యెక్కు వవుతుంది. అందుకని అదీ లాభం లేదు.

ఊరు కొత్తదైనా- పట్టణమైనా, ఇంతకన్నా గొప్ప పట్టణాల్నే చూసిన నాకు దీని ప్రత్యేకత యేమీ కనిపించ లేదు. ఇంతకన్నా పెద్ద పట్టణంలో నివాసాన్ని ఏర్పర్చు కున్నాక- దీని ఆకర్షణ కూడా నన్నేమీ చలింపనీయ లేదు.

ఏమైనా కాలం వెళ్లబుచ్చటం అనే సమస్యకు గురయ్యాక - యేదో విధంగా వెళ్లబుచ్చ వలసిందే! తిరిగిన బజారే తిరుగుతూ చాలాసేపు గడిపాను. కాలు కాలిన పిల్లిలాగు - గమ్యస్థాన నిర్ణయం లేకుండా దారి అనేది వుంది కదా అని తిరగటంలో ఎంత విసుగు! ఎంత శ్రమ! వృథాగా ఏమీ గిట్టుబాటు కాని వ్యాపారం సాగిస్తున్నట్టు తోచటం మరీ బాధాకరంగా తోచింది.

కొంతసేపు రైల్వేస్టేషనులో కూర్చున్నాను. వొచ్చే జనమూ, పొయ్యే జనమూ నన్నేమీ ఆకర్షించ లేదు: కొత్తదనమనేది కనిపించకపోతే- కనిపించలేదే అనే మరో కొత్తబాధ. కనిపించాక దాన్ని మనం భరించగలమో లేమో అది వేరే విషయం!

ఎంతకూ కాలం గడవకుండా వుంది. ఉన్న సినిమా మంచిది కాదని నాకు తెలుసు. అది కాలాన్ని వెళ్ళబుచ్చ లేదని కూడా తెలుసు. అంతకన్నా మరి గత్యంతరం లేదు గనుక సినిమాహాలు వైపే వెళ్లాను.

బైట జనం యెక్కువగా కనిపించ లేదు. ఉన్న జనంలో నాలుగో వంతన్నా సినిమా చూసేవాళ్లుగా నాకు తోచలేదు.

జనం లేకుండా కేవలం యే కొద్దిమందికో చూపబడే చిత్రాన్ని భరించటం మరీ దుర్భరం! జనం తక్కువగా ఉన్నారుకదా అని హాలు నిండి బాగా ఉండేందుకు సినిమావాళ్లు కొంతమందినన్నా వూరికనే పంపరు. ఆ అభిలాష వున్న నాలాటి వాళ్లు, పరాయి వ్యక్తులకు ఎంతో మందికి టిక్కెట్లు కొనటం అసంభవం! సినిమాకు వెళ్లి కొత్తగా తలకాయ నెప్పిని కొనితెచ్చుకోవటమా, మానటమా అనే సమస్య తెగక, హాలు దగ్గరే... తారట్లాడసాగాను.

"ఎప్పుడూ రావటం?" యెంతో పరిచయాన్ని సూచించే కంఠ స్వరం నా వెనుకనుంచి విన వొచ్చింది. నన్ను ఐవుండదనే అనుమానం నాకు లేక పోలేదు. ఐనా కూడా ఏదో ఆశ - బహుశా యెరిగినవాళ్లెవరన్నా పొరపాటునన్నా కనిపిస్తే, కొంతకాలం గడుస్తుందేమోనన్న ఆశ, నన్ను పురిగొల్పింది.

మనిషి ముసలివాడుగానే వున్నాడని చెప్పవొచ్చు. ఆయన ముఖ కళలో ఎంత ఆతృత, మాధుర్యం, తను పోగొట్టుకొని ఇక దొరకదని నిరాశ చేసుకున్న విలువైన వస్తువేదో హఠాత్తుగా కనిపించినప్పుడు కలిగే ఆనందము లాటి దాన్ని నేను గుర్తించాను. నన్నే ఐవుంటుందా అనే అనుమానము నాకిక లేదు. దాదాపు నన్ను నడిబజార్లో కౌగలించుకునేటంత సాహసాన్ని, ఆత్రుతను నిరూపిస్తున్నాడు.

బహుశా నేనెవర్నో ఈయనకు తెలిసివుండి తీరాలి. నాకు మాత్రం ఈయన ముఖం యెక్కడ చూసానో జ్ఞాపకం రావటం లేదు. బహుశా నా చిన్నతనంలో నన్ను బాగా యెరిగి వుంటాడు. నాతండ్రి వయస్సున్న యీ పెద్ద మనిషికి మా కుటుంబంతో యెక్కువ పరిచయం వుండి వుండొచ్చు. ఆ సంగతి నాకు తెలిసి వుండక పోనూవచ్చు.

నిజానికి మా బంధువు లందర్నీ నేను యెరగను. ఇలాటి వింత సంఘటనలు నా జీవితంలో అనేకం జరిగినవి. కనుక ఆ అనుభవంతోటే సంభాషణను నడపగలిగే చాకచక్యం నాకు వున్నదని వేరే చెప్పాలా?

అన్నాను: "ఉదయానే వొచ్చాను."

"ఇంటికన్నా రాలేదేం?"

ఈయన యెవరో నాకింకా నిర్ధారణగానన్నా తెలియదు. ఈయన యింటి సంగతి నాకెలా తెలుస్తుంది?

"ఏం లేదు... వేరే పనివుండి..." అని నీళ్లు నమిలాను.

"మనసులో ఉండాలి కాని, పనులు అడ్డం వొస్తయ్యా?... రా... పోదాం."

నేనేమీ మాట్లాడకుండా ఆయన వెనకాలే నడవ సాగాను. ఈయన యెవరో తెలుసుకోవటం యెట్లాగా అని ఆలోచిస్తున్నాను.

"అందరూ కులాసాయేనా?" అన్నాడు.

"ఆс." ఆ "అందరూ" అనే పదంలో యెందరు వున్నారో కూడా ఊహించ కుండానే అన్నాను.

సందుల్లోంచి తీసుకు వెళ్తున్నాడు- యెక్కడికో? ఇది నాకు పరిచయం లేని పట్టణమని తెలిసినా నాలో భయమేమీ లేదు. యెందుకంటే ఆ పెద్దమనిషి ముఖం చూస్తే ఆయన ఏ విధమైన అపకారాన్ని చేసే చిహ్నాలూ నాకు కనిపించటం లేదు. అసలు ఆయన యెవరో తెలియకుండా ఆయన్ను గూర్చిన ఏ నిశ్చితాభిప్రాయాన్ని కలిగి వుండటానికైనా నాకేం హక్కు వుందీ?

హఠాత్తుగా ఆయన నడక మందగించింది. బహుశా ఆయన చెప్పిన 'ఇల్లు' యీ సమీపంలో వుండొచ్చనే నా ఊహ నిజమే ఐంది.

"రండి" - అన్నాడు తను ఇంట్లోకి జొరబడుతూ.

మధ్య తరగతి కుటుంబ నివాసాన్ని స్ఫురింప జేసింది ఆ ఇల్లు. యెంతో శుభ్రంగా హాయిగా వుంది. నన్ను సావిట్లో కుర్చీలో కూర్చోబెట్టి ఆయన లోపలికి వెళ్లాడు. ఐదు నిమిషాలు ఏకాంతంగానే గడిపాను. పదేళ్ల పిల్ల కాఫీ పట్టుకొచ్చింది. ఆ అమ్మాయి కాఫీ నాకు అందిస్తూ నా మొహంలోకి తేరిపార చూచింది- నేను అవునా కాదా అన్నట్టు. వెళ్తూ వెళ్తూ "బావగారే" అనుకుంది తనలో- నాకూ వినిపించేటంత మెల్లిగా!

ముసలాయన వొచ్చాడు. నా పక్కనే కూర్చుని ఎన్నాళ్లగానో ఇలాటి ఆనందమయ సంఘటన కోసం ఎదురుచూస్తున్న వాడల్లే, ఎంతో తృప్తిలో మునిగిపోయి మాటలు మరిచి పొయ్యాడేమో ననిపించింది.

గది గుమ్మంలోంచి స్త్రీ మొహాలు రహస్యంగా తొంగి చూస్తున్నవి. వాళ్ళు నన్ను చూస్తున్నట్టే నేనుమాత్రం వాళ్లను ఎందుకు చూడకూడదు? ఐతే ఇది వాళ్ల ఇల్లు; సభ్యతను గమనించాల్సిన అవసరం, కనీసం నటించాల్సిన బాధ్యత నాకు వుంది. కుతూహలం వీటన్నిటినీ తోసి పుచ్చింది... ధైర్యం చేసి చూశాను. ఒక ముసలామె - యీ ముసలాడికి భార్య ఐ ఉండొచ్చు; ఆమె వెనుకనే పద్ధెనిమిదేళ్ల నవ జవ్వని - యీ నాలుగు కళ్ళూ నా మీదికే కేంద్రీకరించబడి ఉన్నాయి. వీళ్లెవరిగోలా నాకు పట్టలేదు. ఆ యువతి! ఆమె నన్నా విధంగా చూసినందుకే ఎంతో గర్వంగా, నా గొప్పతన మంతా ఇప్పుడే బైటపడ్డట్టు ఉప్పొంగి పోయాను. కాని వాళ్లెందుకు చూస్తున్నారో అర్థంకాలేదు, ఇందాకటి అమ్మాయి 'బావగారే' అన్న స్వగతానికీ, దీనికి ఏమన్నా సంబంధం వుందేమో? ఇంత ఆశనూ కల్పించుకొన్న నేను నిరాశతో తిరిగిపోవాల్సి రాదు కదా?

"ఎన్నాళ్ళనుంచో ఎదురు చూస్తున్నాము. ఇలాటి శుభగడియలు జీవితంలో ఉండ వేమోననే నిరాశకూడా ఒకప్పుడు కలగకపోలేదు..." అని ముసలాడు నా మొహంలోకి చూశాడు. నన్ను ఉద్దేశించిన మాటలే ఐనా, నాకు అర్థం కానందువల్ల తల వొంచేశాను.

"పిల్లా తల్లీ కూడా ఏకధారగా ఏడ్చారనుకో. ఏమనుకొని ఏం లాభం? ఎవరి తప్పని విచారించటం కూడా అనవసరమనే అనిపించింది. తప్పు యెవరిదైనా దాని ఫలితం, దానికి ఇచ్చుకున్న జరిమానా, ఒక పండంటి కాపరం... ఎలాగో నేనే ఊరడించేవాణ్ణి. ఏదో యవ్వనంలో ఉన్న వాళ్లు కాస్త ఉద్రేకానికి లొంగిపోయి, యే మౌతుందో ననే ఆలోచనన్నా లేకుండానే పట్టుదలలు హెచ్చి ఇలాటి అఘాయిత్యాలు చేస్తారు కాని సత్యం ఎక్కువ కాలం దాగదు. ప్రకృతి శాసనాన్ని అనుసరించి వారే కలుసుకుంటారు; కావాల్సిందల్లా కాస్త ఓర్పు అంతే!... యీనాడు నా మాటలు అక్షరాలా నిజమని నిరూపించ బడినవి!"

ఎలా అర్థం చేసుకునేది యీ మాటల్ని? ముసలాడు మళ్ళీ తన సంభాషణ సాగించాడు:

"నిజానికి వెధవ గొలుసు... ఏం అది లేకపోతే? సంసారానికి అది అడ్డమా? తన అందాన్ని భర్త తక్కువగా చూస్తాడనే విచారమా? సహజ సౌందర్యవతి ఐన ఇందిరలాటి సుందరికి యీ ఆభరణాలు నిజంగా అనవసరమే కదా? ఈ మాత్రం ఆలోచన వుంటే అది నీతో పోట్లాడుతుందీ? పోనీ నువ్వు మాత్రం- ఏదో సరదా పడి అడిగింది కదా అని దానిముచ్చట తీర్చకూడదూ? మరీ తిండికీ గుడ్డకూ మొహం వాచిన వాళ్లు కాదుగా? సంపాయిస్తుంటివి- నీ భార్యను సంతోష పెట్టాల్సిన బాధ్యతనన్నా గుర్తించకుండా యెలా వుండ గలిగావు? ఇంత చిన్న విషయం సంసార

విచ్ఛిన్నతకు కారణ మౌతుందనే ఆలోచన మీ చిన్ని బుర్రల్లో కలిగి వుండదు. అది నిన్ను రెండని, నువ్వు దాన్ని నాలుగంటే ఫలితం-? సంవత్సరం నుంచీ యెడమొగం పెడమొగం- ఆ వేడి చల్లారిందా? నా పెళ్ళాం యెక్కడని వెతుక్కుంటూ వొచ్చావు. ఒకరు చెప్పాలా? చెప్పినా ఆ పట్టుదలతో ఇవన్నీ చెవి కెక్కుతాయా? అంతే- అది కూడా మా ఆయన వొచ్చాడు కదానని సంబర పడింది. ఎన్నాళ్ళ స్నేహమో అన్నట్టు మీరిక చిలకా గోరింకలల్లే కాపరం చేసుకుంటారు. దాంతో సరి!"

ముసలాడి లెక్చర్ పూర్తయిం దనుకుంటాను. మంచి నీళ్ళకోసం ఆజ్ఞాపించాడు.

ఇప్పుడు కాస్త తల కెక్కింది. ఈయన అల్లుడు ఇందిర అనే ఈయన అమ్మాయితో పోట్లాడటం వల్ల సంవత్సరం నుంచీ పుట్టింట్లోనే వుండి పోయింది. ఈ పోట్లాటకు కారణం గొలుసు చేయించమని ఆమె అడగడం, అల్లుడు కాదనటమూను. పోతే ఆ అల్లుడు నాలాగే ఉంటాడు కాబోలు! ఈయన పొరపాటుపడి నన్నే తన అల్లుడుగా భ్రమించాడు. కనుక, వెంటనే ఆయన పొరపాటును చెప్పి ఇక్కణ్నుంచి తప్పుకోవటం అత్యుత్తమం.

మంచినీళ్ల గ్లాసుతో ఆ యువతి ప్రవేశించింది. నేను అక్కడే ఉన్నట్లు ఇప్పుడే, చూసినట్టు నటిస్తూ, క్షణం సేపు నా ముఖంలోకి చూసి, ఎంతో సిగ్గుపడి ఆ గ్లాసుతో ముందుకు పోవటమా లేక వెనక్కు తగ్గటమా అని ఆలోచిస్తున్నట్టు తోచింది.

"సిగ్గేమిటే? మీ ఆయనేనే!" అన్నాడు ముసలాడు.

ముసిముసి నవ్వుల్తో ముసలాడికి మంచి నీళ్ల గ్లాసు అందించింది. ఇప్పుడు యింత దగ్గర్నుంచి చూడటంతో ఆమె సౌందర్యానికి నేను దాదాపు మూర్ఛపొయ్యాను. ఇలాటి అపురూపవతిని ఏ కఠిన హృదయుడు యీ కష్టాల పాలుచేసి ఉంటాడు? వాడిది నిజంగా రాతి హృదయమే ఐ ఉండాలి. పాపం, ఎన్నాళ్ళనుంచీ తన భర్తకోసం యెదురు చూస్తూవుందో మెరిసే ఆ కళ్ళే సాక్ష్యం ఇస్తూన్నవి. రాతిగా మారిన అహల్య శ్రీరామ స్పర్శకోసం పడివుండి, శాప విమోచనం కాగానే ఇలాటి ఉద్విగ్న నేత్రాలతోనే చూసి ఉంటుంది.

ఈ క్షణంలో "నేను మీరు అనుకునే వ్యక్తిని కాను" అని చెపితే యీమె క్షణంలో కొయ్యబారవొచ్చు. ఇంతమందీ నన్ను తమ ఇంటి అల్లుడుగానే నమ్మారు. నా ఒక్కడి మాట యిక్కడ చెల్లదు. "నేను నేనే!" అని నేను రుజువు చేసుకునేందుకు నా తాతలు దిగి రావాలి. ఇంతా ఏడుస్తే నేను సాధించే దేమిటి? ఈ బంగారు బొమ్మను అదృష్టవశాత్తూ అనుభవించే అవకాశాన్ని జారవిడిచి, జీవితమంతా ఈ అపూర్వ సంఘటనను తలుచుకుంటూ ఏడవటం! ఆమెను తిరిగి దుఃఖ సముద్రంలోకి తోసెయ్యటం. ఇందులో న్యాయా న్యాయాల విచక్షణ అనవసరం. ఎందుకంటే ఏ

న్యాయంతో ఆమె భర్త ఆమెను విసర్జించగలిగాడు? అప్పుడు ఏ న్యాయం వీరిద్దరినీ కలప గలిగింది? ఆ కుటుంబానికి సౌఖ్యాన్నీ కూర్చేదీ, నాకు తృప్తి నిచ్చేదీ, యితరులెవరికీ హాని కానిదీ నేను ఆమెకు యివ్వబొయ్యే న్యాయం!

నా పనల్లా అన్నిటికీ మౌనంగా కూర్చోవటమే. మిగతా పనులల్లా వాటంతటవే జరుగుతవి. అనుకున్నట్టే అల్లుడికి జరగాల్సిన మర్యాదల్లో ఏ లోటూ లేకుండానే జరిగింది.

2

చచ్చి స్వర్గానికి పోయి పొందదగ్గ సౌఖ్యం ఏదన్నా వుంటే- అదంతా నేను ఆ రాత్రి ఇందిరను పొందటంలో చవి చూశాను. ఇందిర మాటల్నీ, లాలననూ పట్టిచూస్తే యెంత అమాయకురాలో ననిపించింది. ఏడాదిగా వియోగ భారాన్ని వహిస్తున్న ఆమె- ఈ పన్నెండు నెలల బాకీ ఒక్క సారిగా వసూలు చెయ్యాలనేటంత ఉద్రేకంతో ఊగిపోయింది. అలాటి యువతిని చే జేతులా వొదులుకున్న ఆ దౌర్భాగ్యుడైన భర్త మీద నాకు నిజంగా జాలి వేసింది. కాని ఆ దౌర్భాగ్యుడి వల్లనే నాకీమె పొందు లభించిందనే సత్యం నా కప్పుడు గుర్తులేదు.

ఎంత చిన్న విషయం యీ చిన్న దాన్ని బాధ పెట్టింది! నేను యీ వూరొచ్చిన పనికానీ, సామానంతా హోటల్ గదిలో వుందనే జ్ఞాపకం కానీ నాకు లేదు. నన్ను నేనే మరచిపొయ్యేటట్టు చెయ్యగల ఆ యువతిని ఎలా మరుస్తాను? ఎన్నాళ్లయినా యిక్కడే వుందామా అని నాకు అనిపించింది.

ఆమె భర్త పట్ల ఎంత ప్రణయ స్వరూపిణో నాకు నిర్ధారణగా తెలిసింది. భర్తవలె నటించటంలో యెంతో యిబ్బంది వుంటుందనుకున్నాను కాని, ఆమెను యెంతో తేలిగ్గా మోసపుచ్చ గలిగాను. నాకు నేనై భ్రమించటం లేదిక్కడ.

మర్నాటి ఉదయం నిద్ర లేచేప్పటికి కాఫీ వుప్మాలు సిద్ధంగా వున్నవి. స్వర్గంలో మాత్రం యింతకన్న యెక్కువ వుండేడుస్తుందా! ఆ పగలల్లా హాయిగా తగినంత విశ్రాంతి తీసుకున్నాను. బైటికివెళ్ళ బుద్ధి కాలేదు. ఇంట్లో బాధ పడలేక బైటికి వెళ్ళవలసిన అవసరం ఇంకా కలగ లేదు.

ఇలాగే ఐదు రోజులు గడచి పోయినవి. కాలం సాగినకొద్దీ నాలో భయం యెక్కువవసాగింది. వాళ్ళు వెళ్ళమనరు- అల్లుణ్ని వెళ్లమంటారా? కాని ఈ వ్యవహారం చాలా దూరం వెళ్ళేట్టుగా వుంది. నేను వెళ్ళేప్పుడు ఆమె కూడా నా వెంట పడితే? ఈమెను తీసుకు వెళ్ళి నేనెక్కడ సంసారం పెట్టేది? అసలు బండారమంతా అప్పుడు బైటపడక మానదాయె. దీనికి యేమిటా వుపాయం అని ఆలోచిస్తున్నాను.

ఆ రాత్రి మెల్లిగా కదలేశాను.

"రేపు నేను వెళ్తాను" అన్నాను ఆమెతో.

"ఎక్కడికీ! నేను మాత్రం మిమ్మ్మ విడిచి క్షణంకూడా వుండను. నన్ను కూడా మీతో తీసుకు వెళ్లండి."

"నేను వెళ్లి వుత్తరం రాస్తాను. మీ నాన్న తీసుకొచ్చి దిగపెడతాడులే!" అన్నాను నేను.

"ఉహూఁ. ఇదివరకు ఐంది చాలు. నన్ను తీసుకువెళ్లక పోతే చంపుకున్నట్టే!" అన్నది ఇందిర.

ఎంత బతిమాలి చెప్పినా ఇదే వరస. నిద్రపోనిచ్చి ఆలోచించాను. ఏ బజారుకనో దూసుకొంటే? కాని– యీ అమాయకురాలిని ఇంత అనుభవాన్ని నాకిచ్చిన యువతిని, యిలా మోసపుచ్చి తిరిగి బాధ పెట్టటం కన్న అమానుషత్వం వుందా? చూస్తూ చూస్తూ ఆ పని చేయలేనేమో ననిపించింది.

ఇంకో వుపాయం ఆలోచించాను. సామాన్యంగా స్త్రీలను నగలతో మభ్య పెట్టవొచ్చు. అందులోనూ యిన్నాళ్లుగా ఆమెను బాధపెట్టిన ఆ గొలుసును చేయించి యిస్తే, ఆమెకు యెంతో తృప్తి కలుగుతుంది. ఆ సంగతి యెత్తుతే మళ్ళీ ఏ ప్రమాదం వొచ్చి పడుతుందోనని ఆమె తగిన జాగ్రత్త తీసుకుంది. ఇక నా అంతట నేనే ఆ పని చేస్తే– పిల్లాడికి తినుబండార మేదో యిచ్చి మాయపుచ్చినట్టు ఈమె మనసును కూడా వేరే తోవలోకి నెట్టి నేను బైట పడదామనే నిశ్చయానికి వొచ్చాను.

మర్నాడు గొలుసు సంగతి ఎత్తేప్పటికి ఆమె బుంగమూతి పెట్టి "పోనీండి– మళ్లీ ఆ సంగతి దేనికి?" అంది.

"అదికాదు... గొలుసు చేయించుకో. ఇదుకో పైకం" ఐదువందల రూపాయిల కాగితాలు ఇచ్చాను. ఇంత ధరా అనే అనుమానం నాకు కలగలేదు. ఆమె ముఖం వికసించటంతో నాకు ఎంతో రిలీఫ్ కలిగింది.

"యీ మధ్యాహ్నం బండికి నేను వెళ్తాను. మళ్ళీ ఐదారురోజుల్లో వొచ్చి నిన్ను తీసుకెళ్తాను. అప్పటికి యీ బోసిమెడలో గొలుసుకూడా వుంటుంది!" అన్నాను.

"వెక్కిరించకండి. ఏ మెడైనా మీ సొత్తేగా" అంది. నన్ను వెళ్లనివ్వని ఆమె పట్టుదల సడలటం చూశాక, నాకు యెంతో స్వేచ్ఛ రాబోతోందని సంతోషించాను.

ఆ మధ్యాహ్నం బండికని బయలుదేరి, ఆమెను చాలాసేపు ఊరడించి ఎలాగో బైటపడ్డాను.

3

స్నేహితుణ్ని వెతికాను. ఆ సాయంత్రం దాకా వాడితో ఉండి రాత్రి బండికి వెళ్ళిపోదామని నా నిశ్చయం. ఆ ముసలాడు ఎక్కడ యెదురౌతాడో నని భయంగానే వుంది. ఐనా పక్కన వీడొకడు ఉంటాడు కనుక, తప్పించుకో గలననే ధైర్యంకూడా లేకపోలేదు.

ఆ సాయంత్రం కాఫీ హోటల్లో కూర్చొని మాట్లాడుకుంటున్నాం. మా వాడి స్నేహితులు ఇంకా ఇద్దరు ముగ్గురు ఉన్నారు.

హఠాత్తుగా ఒకడు "అడుగో మామయ్య అల్లుణ్ని తీసుకుని వెళ్తున్నాడు!" అన్నాడు.

అటుతిరిగి చూద్దును కదా- ముసలాడు! "మామయ్య" అనే పదం వీడిని గురించి అన్నదేనా అని నాకు అనుమానం వేసింది.

"ఎవరూ?" అన్నాను.

"ఆ ముసలాడు. అఖండుడు! అందమైన కూతురుంది. కొత్త మొహం ఊళ్ళో కనిపిస్తే- కాస్త జల్సారాయుడిగా, డబ్బున్న వాడుగా ఉంటే చాలు. తన అల్లుడని భ్రమించినట్టు యెత్తువేసి ఇంటికి తీసుకువెళ్తాడు..."

"మనలాటి వాళ్లకు ఛాన్సులేదురా, యీ వెధవ ఊళ్ళో ఉండటమే మనం చేసిన పాపం."

ముసలాడు కొత్త యువకుడితో మేము కూర్చున్న కాఫీ హోటలుకే వొచ్చాడు. మా పక్కనే వున్న టేబిల్ ముందు ఇద్దరూ కూర్చొని కాఫీ తాగుతున్నారు. నన్నెక్కడ చూస్తాడోనని భయపడి ఛస్తున్నాను. చూడనే చూశాడు- ఐతేనేం- నన్నెప్పుడూ చూడనట్టే, లెక్క చేయనట్టే ఊరుకున్నాడు.

ఇక జీవితంలో ఆ వూరు వెళ్లదల్చుకో లేదు సరికదా- ఆ ఊరు పేరు వింటే మామయ్య జ్ఞాపకం రాకమానదు.